క్లుప్తంగా

శ్రీనివాసవర్మకు శుభాకాంక్షలు



మంత్రి శ్రీనివాసవర్మకు బొకే ఇస్తున్న గారపాటి చౌదరి

ఏలూరు (టూటౌన్): కేంద్ర పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించిన ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మకు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

గోపన్నపాలెంలో పారిశుధ్య వారోత్సవాలు



గోపన్నపాలెంలో పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న మండల ఈఓఆర్డీ మూర్తి

దెందులూరు: ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు నూరు శాతం పూర్తి చేయాలని దెందులూరు మండల పంచాయతీ విస్తరణాధికారి మూర్తి అన్నారు. మంగళవారం గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను ఆయన ప్రారంభించారు. పనులను మండల పంచాయతీ విస్తరణాధికారి పరిశీలించి పలు సూచనలు చేశారు.

పశువులకు హెచ్ఎస్ వ్యాక్సిన్



గేదెలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్యసిబ్బంది

దెందులూరు: పోతునూరు పశు వైద్యశాల పరిధిలో హెచ్ఎస్ వ్యాక్సిన్ (దొమ్మ టీకా)ను గేదెలు, ఆవులకు వేస్తున్నామని పశు వైద్యశాఖ జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ సీహెచ్ శ్రీరాములు తెలిపారు. మంగళవారం పోతునూరులో పశువైద్యశాఖ ఆదేశాలకు అనుగుణంగా గేదెలు, ఆవులు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ప్రతి గ్రామంలో హెచ్ఎస్ వ్యాక్సిన్ వేస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోతునూరు పశువైద్యశాఖ పరిధిలో 2,240 గేదెలు, ఆవులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 70 శాతం వ్యాక్సిన్లు వేశామన్నారు. పశువులకు వ్యాక్సిన్లు వేయించకుంటే గొంతువాపు వచ్చే ప్రమాదం ఉందని జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ శ్రీరాములు అన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో నివసిస్తున్న యువ్వనపూడి నాగేశ్వరరావు, లక్ష్మి దంపతులకు సొంత గూడు లేక ఇబ్బంది పడుతున్నారు. కొబ్బరి మట్టలతో వారు ఏర్పాటు చేసిన గుడెసెలో విద్యుత్ వంటి కనీస సౌకర్యం కూడా లేదు. దశాబ్ద కాలంగా దెందులూరు నియోజకవర్గంలో పేదలకు, రోగులకు ఆపన్న హస్తం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థ చేయూత సభ్యులు వారి ఇంటికి వెళ్లి అక్కడి పరిస్థితులు చూసి స్పందించి రూ.10 వేలు నగదు, నిత్యావసర వస్తువులను సోమవారం అందజేశారు. మేకా లక్ష్మీనారాయణ, పరసా నాగార్జున, ఏనుగు రామకృష్ణ, మరీదు లక్ష్మణరావు, గంగుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్న బాలికలు

- వరుస విజయాలతో పేరు ప్రఖ్యాతులు
- చదువుతోపాటు నిత్యం సాధన
- కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థినుల ఘనత

ఏలూరు రూరల్ : బాస్కెట్‌బాల్ క్రీడలో కొన్నేళ్లుగా వరుస విజయాలతో రాణిస్తూ.. తోటి బాలికల్లో స్ఫూర్తి నింపుతున్నారు స్థానిక కస్తూరిబా బాలికల పాఠశాల విద్యార్థినులు. ఈ క్రీడాకారిణులంతా పేద కుటుంబాలకు చెందిన వారుకావడం విశేషం. 40 ఏళ్ల చరిత్ర గల నూజివీడు కళాప్రపూర్ణ శ్రీరాజాబహుదూర్ 44వ మెమోరియల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ చాంపియన్‌షిప్ సాధించారు. విజయవాడ, అమలాపురం టోర్నీలో ద్వితీయ స్థానంలో నిలిచి తమ సత్తా చాటారు. చదువు కొనసాగిస్తూనే నిత్యం ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. వీరి అద్భుత ప్రతిభ, పాటవాలు చూసి జిల్లా బాస్కెట్‌బాల్ క్రీడాభిమానులు ఆనందిస్తున్నారు.



పతకాలు, కప్పులతో ఏలూరు బాలికలు (ఫైల్)

జాతీయ స్థాయిలో రాణిస్తా



బాస్కెట్‌బాల్ అంటే చాలా ఇష్టం. స్కూల్ స్థాయి నుంచే సాధన చేస్తున్నాను. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రాక్టీస్ చేస్తున్నాను. ఈ ఏడాది కాలేజీ చదువుకు వచ్చాను. ఇప్పటి వరకూ జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడాను. జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఉంది. బాస్కెట్‌బాల్ గురించి మాట్లాడుకుంటే అందరూ నా గురించి కూడా మాట్లాడుకోవాలి. అలా బాస్కెట్‌బాల్ క్రీడలో పేరు తెచ్చుకోవాలని ఉంది.– ఎ.రుత్విక

ప్రభుత్వ కొలువు సాధిస్తా



స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని ఉంది. నా కుటుంబానికి చేదోడుగా నిలుస్తాను. అందుకోసం బాస్కెట్‌బాల్ ఆడుతున్నాను. అదే నా లక్ష్యం. ఇప్పుడు కాలేజీ చదువు ప్రారంభించాను. రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. ప్రైవేటు టోర్నీలో ఏలూరు జట్టుగా ఆడుతున్నాం. నూజివీడు, మార్టేరు విజయవాడ టోర్నిలో ఆడాను. నాలో ఆత్మ విశ్వాసం పెరిగింది. మరిన్ని విజయాలు సాధిస్తాను. – జి.పూజిత

ఉన్నత స్థాయికి ఎదుగుతా



ఉన్నత స్థాయికి ఎదగాలి. అందుకోసం చదువుతో పాటు ఆట కూడా ఆడాలి. అందుకే స్కూల్ స్థాయి నుంచే బాస్కెట్‌బాల్ ఆడుతున్నాను. క్రమం తప్పకుండా సాధన చేస్తున్నాను. ఇప్పటి వరకు జూనియర్, అండర్–16 రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. నా సర్టిఫికెట్లతో స్పోర్ట్స్ కోటాలో తప్పకుండా ఉద్యోగం వస్తుందని భావిస్తున్నాను. రానున్న రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొంటాను. – పి.జయశ్రీ

జాతీయ జట్టులో చోటు సాధిస్తా



చిన్నప్పటి నుంచీ బాస్కెట్‌బాల్ ఆడుతున్నాను. స్కూల్ స్థాయిలో రాణించాను. ఇప్పుడు కాలేజీ స్థాయిలో కూడా రాణించాలని ఉంది. తర్వాత యూనివర్శిటీలో సైతం బాగా ఆడి పేరు తెచ్చుకొంటాను. మరింత నైపుణ్యం సాధిస్తాను. జాతీయ జట్టులో చోటు సాధించి అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణిగా ఎదుగుతాను. అందుకోసం చదువుతో పాటు క్రమం తప్పకుండా ఆడుతున్నాను. – పి.నందిని

ఆదర్శంగా ఉంటా



బాస్కెట్‌బాల్ ఆటలో ఆడపిల్లలు బాగా ఆడుతున్నారు. నా సీనియర్స్‌ను చూసి నేను ఆట నేర్చుకున్నాను. ఇప్పుడు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడుతున్నాను. నా ఆట చూసి అందరూ మెచ్చుకోవాలి. అప్పుడే నాకు సంతోషంగా ఉంటుంది. అందుకే ప్రతిరోజూ సాధన చేస్తున్నాను. మా కోచ్ మురళీకృష్ణ నాకు శిక్షణ అందిస్తున్నారు. ఆయన సూచనల మేరకు మేమందరం అన్ని స్థాయిల పోటీల్లో పాల్గొంటున్నాం. – సాయిభవాని

కష్టానికి తగిన ఫలితం



బాస్కెట్‌బాల్ పోటీల్లో ఏలూరు బాలికలకు మంచి పేరు వచ్చింది. ఏ టోర్నీలో పాల్గొన్నా ఏలూరు క్రీడాకారిణులు విజయం సాధిస్తున్నారు. వీరితో పాటు మరో 30 మంది జూనియర్ క్రీడాకారిణులు సాధన చేస్తున్నారు. భవిషత్తులో వీరు క్రీడాకారులుగా రాణిస్తారు. వీరంతా స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించాలి. మంచి స్థాయిలో స్థిరపడాలి. వారి కుటుంబాలకు బాసటగా నిలవాలి. తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలి. – కె.మురళీకృష్ణ, పీఈటీ

బాస్కెట్‌బాల్‌కు పూర్వ వైభవం వస్తోంది



ఏలూరు బాలికలు బాస్కెట్‌బాల్ క్రీడాకారిణులు సత్తా చాటుతున్నారు. పాల్గొన్న ప్రతి పోటీలో పెద్దపెద్ద జట్లను ఓడిస్తున్నారు. వీరందరికీ కస్తూరిబా బాలికల పాఠశాల పీఈటీ మురళీకృష్ణ శిక్షణ ఇస్తున్నారు. ఇదంతా చూస్తుంటే గర్వంగా ఉంది. ఇదే స్ఫూర్తి కొనసాగాలి. భవిషత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని ఆశిస్తున్నాను. – గవ్వ శ్రీనివాస్, అసోసియేషన్ కార్యదర్శి

మోటూరుకు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): సీపీఎం రాష్ట్ర నాయకులుగా, ప్రజాశక్తి సంపాదకుడిగా పనిచేసిన మోటూరు హనుమంతరావుకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మోటూరు 23వ వర్ధంతి సభ మంగళవారం స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్ లింగరాజులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మోటూరు సేవలను గుర్తుచేశారు. నాయకులు పి.కిషోర్, పి.రామకృష్ణ, బి.సోమయ్య, కంది విశ్వనాథం, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, వై.కోటేశ్వరరావు, వి.శివప్రసాద్, పి.గంగరాజు, వై.సీతారామ్, పి.సూర్యారావు, ఆర్‌వీఎస్ నారాయణ, మీసాల సీత్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారీ బడికి వెళ్లాలి



హైస్కూల్లో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాద్

దెందులూరు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సమాజంలోని ప్రతి చిన్నారీ బడికి వెళ్లి విద్యనభ్యసించాలని దెందులూరు ఎంపీడీఓ పీ.శ్రీలత అన్నారు. మంగళవారం దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో నేను బడికి పోతా కార్యక్రమంలో చిన్నారులను బడిలో చేర్పించడం కోసం దెందులూరు పాఠశాలకు విచ్చేసిన తల్లిదండ్రులు, విద్యార్థులతో ఎంపీడీఓ సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పీ.శ్రీలత, ఎంఈఓ ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి, అవగాహన లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఉన్నారు.

సీసీ కెమెరాల పాత్రే కీలకం

- ఏలూరు నగరంపై మూడో కన్ను
- సమస్యాత్మక ప్రాంతాలపైనా దృష్టి

ఏలూరు టౌన్: 'ఏలూరు సత్రంపాడు ప్రాంతంలో ప్రేమోన్మాది చేతిలో ఒక యువతి హత్యకు గురైంది. ఏలూరు ఎంఆర్‌సీ కాలనీకి చెందిన రత్నగ్రేస్ అనే యువతి, ముసునూరు ప్రాంతానికి చెందిన ఏసురత్నం అనే యువకుడు మధ్య చోటు చేసుకున్న ఘటనల నేపథ్యంలో యువతిని అత్యంత పాశవికంగా హత్య చేశాడు. ఈ ఘటనలో సీసీ కెమెరాలు ప్రధాన ఆధారంగా మారాయి'.

'ఏలూరు ఆముదాల అప్పలస్వామి కాలనీలో ఒక ఇంట్లో సుమారు రూ.2 లక్షలు విలువైన నగదు, నగలు చోరీ చేశాడో దొంగ. పోలీసులు ఇంటికి సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించి మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని అనుమానితుడిగా గుర్తించారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో దొంగను పట్టుకున్నారు. రూ.2 లక్షలు చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు'.

..ఇలా నేరపరిశోధనలో సీసీ టీవీ కెమెరాల పాత్ర కీలకంగా మారింది. గతంలో ఏదైనా నేరం జరిగితే దర్యాప్తునకు ఎంతో సమయం పట్టేది. పైగా ఆయా కేసుల్లో నిందితుడు ఆచూకీ తెలుసుకోవడమే పోలీసులకు కష్టంగా మారేది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ నేర పరిశోధనలో పోలీసులు ముందడుగు వేస్తున్నారు.



ఫైర్‌స్టేషన్ సెంటరులో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

భారీగా చోరీసొత్తు రికవరీ

ఏలూరు నగరంలో గత రెండేళ్లుగా రాష్ట్ర, అంతరాష్ట్ర ముఠాలు పలు చోరీలు, ఇతర నేరాలకు సంబంధించి సుమారు 18 కేసులు నమోదుచేయగా, ఏలూరు సీసీఎస్ పోలీసులు భారీ ఎత్తున చోరి సొత్తును రికవరీ చేశారు. ఏలూరు సీసీఎస్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడాదిలో రూ.3,20,44,000 చోరి సొత్తును, గంజాయిని, బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



పత్తేబాద రోడ్డులోని సీసీ కెమెరాలు



జీవీమాల్ సెంటరులోని సీసీ కెమెరాలు

సమస్యాత్మక ప్రాంతాల్లోనూ నిఘా పెట్టాలి

ఏలూరు జిల్లా, నగరంలో కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏలూరు నగరంలోని ప్రధాన కూడళ్లలో సుమారుగా 40కుపైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కొన్ని సమస్యాత్మక ప్రాంతాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తే నేర పరిశోధనకు దోహదపడుతుంది. నేరస్తులు సైతం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేందుకు భయపడే అవకాశం ఏర్పడుతుంది. శాంతిభద్రతల పరిరక్షణలోనూ సీసీ కెమెరాల నిఘా కీలకంగా మారుతుంది.

నిఘా వ్యవస్థ పటిష్టం



ఎస్పీ మేరీ ప్రశాంతి ఆధ్వర్యంలో పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశాం. ప్రభుత్వం పోలీస్ స్టేషన్లల్లోనూ బాధితులకు సక్రమంగా న్యాయం జరిగేలా సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఆయా కేసుల్లో నేరస్తులను పట్టుకునేందుకు సీసీ టీవీ ఫుటేజీ ఎంతగానో ఉపయోగపడుతుంది. అసాంఘీక శక్తులకు అవకాశం లేకుండా నిఘా పెంచాం. ముఖ్య కూడళ్లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

– సీహెచ్ మురళీకృష్ణ, సీసీఎస్ సీఐ, ఏలూరు

ఏలూరులో ఏరియా ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ఏరియా ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీపీఎం ఏలూరు నగర కమిటీ కోరింది. స్థానిక పవరుపేటలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కె.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. ఏలూరులో ప్రభుత్వ బోధన ఆసుపత్రి పేరుతో పేదలకు వైద్య సేవలు అందించే జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను రద్దు చేశారని, దీంతో 42 మంది స్పెషలిస్టు వైద్యులు, 150 మంది వరకు వైద్య సిబ్బంది, 350 బెడ్స్‌ను రద్దయ్యాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజలకు తగినంతగా వైద్యసేవలు అందుబాటులో లేకపోవడంతో ఏలూరు ఆస్పత్రికి వస్తున్న రోగులను విజయవాడ, గుంటూరు పంపిస్తున్నారని తెలిపారు. అక్కడ వరకు వెళ్లలేని రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి, అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బోధన ఆసుపత్రి పూర్తి కావాలంటే మూడు నుంచి ఐదేళ్ల సమయం పడుతుందన్నారు. ఒక్కో విభాగానికీ మూడు యూనిట్లు అవసరం కాగా, ప్రస్తుతం ఒక యూనిట్ మాత్రమే ఉందని తెలిపారు. మెడికల్ కాలేజీ పనులు వేగవంతం చేయడంతో పాటు మెడికల్ కాలేజీ పేరుతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రద్దయిన వైద్యులు, వైద్య సిబ్బందిని, బెడ్స్‌ను పునరుద్ధరించాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ, ఎంఆర్ఐ స్కాన్లు, ఆసుపత్రిలోని అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఆ రోజే రిపోర్టు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగు పర్చే చర్యలను కొత్త ప్రభుత్వం తక్షణం చేపట్టాలన్నారు. సమావేశంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, జి.రవికిషోర్, వైఎస్ కనకారావు, వీవీవీఎస్ ప్రసాద్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్యదర్శి కిషోర్

కొబ్బరి రైతులను ఆదుకోండి

ఏలూరు (టూటౌన్): కొబ్బరి కాయలకు కనీస ధర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన కొబ్బరి రైతుల సమస్యలు, ధాన్యం బకాయిలపై మాట్లాడారు. వెయ్యి కొబ్బరి కాయలకు రూ.8 వేలు మాత్రమే ధర వస్తోందన్నారు. వెయ్యి కాయలు కోసి గుట్టగా వేయడానికి రూ.3 వేలు ఖర్చు అవుతుందని, పంట సాగుకు రైతు పెట్టిన పెట్టుబడి రావడం లేదని చెప్పారు. తెగుళ్ల వల్ల దిగుబడులు బాగా తగ్గిపోయాయని, ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు తగ్గాయని తెలిపారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తులు ఇబ్బడి ముబ్బడిగా దిగుమతులు కావడంతో దేశీయంగా మార్కెట్లో కొబ్బరికాయలు ధర పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వ విధానాలే కారణమని విమర్శించారు. రాష్ట్రంలో కొబ్బరి అత్యధికంగా సాగు చేసే కోనసీమ, ఉద్దానం, పశ్చిమ గోదావరి, ఏలూరు, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ తదితర ప్రాంతాలు, జిల్లాల్లోని కొబ్బరి రైతులు నష్టాలు పాలై ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో వెంటనే నాఫెడ్ – ఆయిల్ ఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని డిమాండ్ చేశారు. వెయ్యి కొబ్బరి కాయలకు కనీస ధర రైతుకు రూ.15 వేలు ఇవ్వాలని, రైతుల నుంచి నేరుగా కొబ్బరికాయలు సేకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర మిల్లింగ్ కొబ్బరి క్వింటాల్‌కు రూ.11,160, బంతి కొబ్బరి క్వింటాల్‌కు రూ.12 వేలు రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదని చెప్పారు. మద్దతు ధర క్వింటాల్‌కు రూ.15 వేలకు పెంచాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం కార్యదర్శి శ్రీనివాస్

ధాన్యం బకాయిలు చెల్లించాలి

జిల్లాలో రైతులకు ఇవ్వాల్సిన రూ.240 కోట్ల ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని శ్రీనివాస్ కోరారు. ధాన్యం సొమ్ము అందకపోతే ఖరీఫ్ సాగు చేసే పరిస్థితి లేదని చెప్పారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం రేమల్లె వాస్తవ్యులు తుమ్మల రవికాంత్, అన్నదానం నిర్వహించారు. భక్తులు అర్చకులు పాల్గొన్నారు.

29న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం

దెందులూరు: దెందులూరు గారపాటి హైమావతిదేవి ఉన్నత పాఠశాలలో ఈ నెల 29న దివ్యాంగుల నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీలత, ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. మంగళవారం దెందులూరు ఎంఆర్‌సీ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎంఈఓలు మాట్లాడుతూ దివ్యాంగులైన బాలబాలికలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి వారి అవసరాలకు ఉపకరణాలు అందజేస్తారన్నారు. అభ్యర్థులకు, వారి తల్లిదండ్రులకు భోజన వసతితో పాటు రవాణా ఖర్చులు ఇస్తామన్నారు. మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, సదరం, రేషన్ కార్డులు జిరాక్స్ కాపీలు తీసుకురావాలన్నారు. బుద్ధి మాంద్యం గల పిల్లలకు అదనంగా కులధ్రువీకరణ పత్రం (పాతదైనా పర్వాలేదు) యూడీఐడీ కార్డు జిరాక్స్ కాపీలు, 4 ఫొటోలు తీసుకురావాలన్నారు.

ఈదురుగాలులకు కూలిన చెట్లు

దెందులూరు: దెందులూరులో ఈదురుగాలులు, వర్షానికి మంగళవారం సాయంత్రం చెట్లు కూలిపోయాయి. కొవ్వలి వంతెన వద్ద దెందులూరు ప్రాథమిక పాఠశాల వద్ద కొమ్మలు, చెట్లు పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఒక పక్క వర్షం, మరొక పక్క ఈదురుగాలులు వీయడంతో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ శాఖ దెందులూరు మండల అసిస్టెంట్ ఇంజనీర్ ఉషారాణి ఆధ్వర్యంలో దెందులూరు లైన్‌మెన్ వీరయ్య, గ్రామంలో కొందరు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. కూలిన చెట్లు, విరిగిపడిన కొమ్మలను నరికి తొలగించారు. ట్రాక్టర్‌పై కలపను తరలించి రాకపోకలకు అంతరాయం లేకుండా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు. ఈదురుగాలులు తగ్గుముఖం పట్టిన తరువాత లైన్లు పరిశీలించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఈదురుగాలులు, జోరు వర్షంలో శ్రమించిన దెందులూరు లైన్‌మెన్ వీరయ్యను అసిస్టెంట్ ఇంజనీర్ ఉషారాణి, గ్రామస్తులు అభినందించారు.

సీతంపేట కాలువలో అడ్డుగా ఉన్న మట్టిని తొలగిస్తాం



డీఈ కొడాలి బాబుతో మాట్లాడుతున్న నాయకులు

దెందులూరు: సీతంపేట కాలువలో 5 వేల ఎకరాల సాగు ప్రయోజనాలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ డివిజనల్ ఇంజనీర్ కొడాలి బాబు అన్నారు. మంగళవారం రైతు నాయకులు వీరమాచినేని శివాజీ, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జి గారపాటి కొండయ్య చౌదరి ఆధ్వర్యంలో సీతంపేట కాల్వ ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో వీరమాచినేని శివాజీ, గారపాటి కొండయ్యచౌదరి మాట్లాడుతూ దెందులూరు– అలుగులగూడెం రైల్వే క్రాసింగ్ రోడ్డు వద్ద అండర్‌పాస్ నిర్మించిన సమయంలో మట్టిని రైల్వే కాంట్రాక్టర్ సీతంపేట కాలువలో వేశారన్నారు. సీతంపేట కాలువ ఆయకట్టులో 5 వేల ఎకరాలకుపైగా సాగు ఆధారపడి ఉందన్నారు. వెంటనే మట్టిని తొలగించి నీరు చివర భూములకు సైతం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు నాయకులు, రైతుల సూచనల మేరకు డివిజనల్ బాబు రైల్వే అధికారులతో మాట్లాడారు. తక్షణమే పనులు ప్రారంభించి సాగుకు నీరందే విషయంలో అడ్డంకులు లేకుండా చర్యలు ప్రారంభిస్తామని రైల్వే అధికారులు డీఈకి సమాధానమిచ్చారు. అనంతరం సైఫన్ మరమ్మతులు చేయాలని కోరారు. సమావేశంలో దెందులూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు, ఆయకట్టు రైతులు, ఇరిగేషన్ ఏఈ సుబ్రహ్మణ్యం ఉన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	29
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	45
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	16.00	--
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు – బీహెచ్ఈఎల్	21,.15	4822	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	--
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.10	98503	--
ఏలూరు – తిరుపతి	16.00	4830	28